Sakshi

06/11/18.

# హైటెక్‌సిటీ రూట్ మెట్రో పరుగుకు సిద్ధం



అవార్డు అందుకుంటున్న ఎన్వీఎస్‌రెడ్డి, కేవీబీరెడ్డి

- వచ్చేనెలలో లాంఛనంగా ప్రారంభం
- త్వరలో ఆర్టీసీ–మెట్రో ఉమ్మడి పాస్‌లు
- డిసెంబరు నాటికి మెట్రో నెలవారీ పాస్‌లు రెడీ
- వెల్లడించిన హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

రాంగోపాల్‌పేట్: ఈ ఏడాది డిసెంబర్‌లో అమీర్‌పేట్– హైటెక్ సిటీ రూట్‌లో మెట్రో రైళ్లు పరుగులు పెడతాయని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సోమవారం బేగంపేట్‌లోని మెట్రోరైలు భవన్‌లో ఎల్‌అండ్‌టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. హైటెక్‌సిటీ రూట్లో ఇప్పటికే సివిల్, ఎలక్ట్రికల్ పనులు పూర్తయ్యాయని, రైలు రివర్సల్ సౌకర్యం ఇతర సాంకేతిక పద్ధతులను పరిశీలించి రాకపోకలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. మెట్రో రెండో దశలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణ పనులకు సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించామని, ఎన్నికల తర్వాత కొలువుదీరే నూతన ప్రభుత్వానికి డీపీఆర్ అందజేస్తామన్నారు. జేబీఎస్–ఎంజీబీఎస్ మార్గంలో మెట్రో రైళ్ల రాకపోకలు వచ్చే ఏడాది జూన్‌లో ప్రారంభమతాయని సూచనప్రాయంగా చెప్పారు. ఆర్టీసీ, మెట్రో ఉమ్మడి పాసులను కూడా మరో మూడునెలల్లో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఈ అంశంలో సాంకేతిక అంశాలపై ఆర్టీసీ అధికారులతో చర్చిస్తున్నామన్నారు. మెట్రో నెలవారీ పాసులు కూడా డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని, వాటికి రోజువారీ చార్జీలతో పోలిస్తే కొంత రాయితీ ఉంటుందన్నారు. నగర మెట్రో చార్జీలు ఆర్టీసీ ఏసీ బస్సుల కంటే తక్కువగానే ఉన్నాయన్నారు. ఎల్‌అండ్‌టీకి సంబంధించిన వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే ప్రస్తుతం పార్కింగ్ ఫీజు గంటకు రూ.3 వసూలు చేస్తున్నారని, హెచ్‌ఎంఆర్‌లో కూడా ,త్వరలో స్మార్ట్ పార్కింగ్ ఏర్పాటు చేసి ఇవే చార్జీలు వసూలు చేస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్‌లో సాంకేతిక కారణాలతో తరచూ నిలిచిపోవడం వంటి సంఘటనలను పరిశీలిస్తే.. మిగతా నగరాల్లో పోలిస్తే నగరంలో చాలా తక్కువేనన్నారు. ఆదివారం మెట్రో రైల్ ఉప్పల్ ప్రాంతంలో నిలిచిపోవడానికి కార్బన్ ఫార్మేషన్ కారణమని వివరణ ఇచ్చారు. వాతావరణంలో పెరిగిపోతున్న హైడ్రోజన్ సల్ఫైడ్ వల్ల ఇలా జరుగుతుందని దీన్ని నివారించేందుకు సాంకేతిక అంశాలను పరిశీలిస్తున్నామన్నారు.

## నగర మెట్రోకు మరో అవార్డు

నగర మెట్రో ప్రాజెక్టు మరో పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చే 'బెస్ట్ అర్బన్ మాస్ ట్రాన్సిట్ ప్రాజెక్ట్' అవార్డ్‌ను మెట్రో ప్రాజెక్టు అందుకుంది. ఈ అవార్డును ఆదివారం నాగ్‌పూర్‌లో జరిగిన అర్బన్ మొబిలిటీ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో హెచ్‌ఎంఆర్‌ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్‌అండ్‌టీ మెట్రో ఎండీ కె.వి.బి.రెడ్డి సంయుక్తంగా అందుకున్నారు. నగర మెట్రో ప్రాజెక్టు ఎన్నో సాంకేతిక, ఇంజినీరింగ్ సవాళ్లను అధిగమించడమేగాక.. సరికొత్త ఆర్థిక నమూనాను ఆవిష్కరించిందన్నారు. పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు నగర పునర్నిర్మాణానికి దోహదం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కాగా ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా వివిధ పట్టణాలకు చెందిన వారితో పాటు విదేశాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా ఈ అవార్డు సాధనతో నగరమెట్రో ప్రాజెక్టుకు ఇప్పటి దాకా 68 అవార్డులు దక్కినట్లు హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.